క్లుప్తంగా

'త్రిశూల్' రికార్డుల్లో పాల్వంచ మహిళలు



దేశభక్తి గేయం ఆలపిస్తున్న మహిళలు

పాల్వంచ: బెంగళూరుకు చెందిన త్రిశూల్ ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్ కార్యక్రమాన్ని ఆదివారం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ టాలెంటెడ్ లేడీస్ అండ్ కిడ్స్ ఒరిజినల్ ఫౌండేషన్ ఆధ్వర్యాన పాల్వంచ నుంచి వంద మంది మహిళలు, చిన్నారులు పాల్గొని దేశభక్తి గేయాన్ని ఆలపించారు.

జేకే ఓసీ పీఓగా కృష్ణమోహన్



కృష్ణమోహన్‌ను అభినందిస్తున్న శివప్రసాద్

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా కృష్ణమోహన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, కార్మికులు ఘనంగా స్వాగతం పలికారు. శివప్రసాద్, సర్వే అధికారి బి.నాగేశ్వరరావు, అధికారులు యాస శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కిషన్, దేవేందర్ నాయక్, డేవిడ్ ఉన్నారు.

రోడ్డుపై చెత్త వేసి నిరసన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి ఆరో వార్డులో ఇరవై రోజులుగా చెత్త సేకరణ వాహనం రాకపోవడంతో స్థానికులు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఇళ్లలో పేరుకుపోయిన చెత్తను రహదారిపై వేశారు. సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఎస్‌కే ఫహీమ్ మాట్లాడుతూ... రోజుల తరబడి చెత్త సేకరించకపోవడంతో ఇళ్లలో దుర్వాసన వస్తోందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

విరాళం..

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన కొత్తగూడెంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మూట తిర్మల్‌రావు, రాధ దంపతులు రూ.5,116 విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేశారు.

కార్యదర్శులకు సన్మానం



సన్మానిస్తున్న గ్రామస్తులు

టేకులపల్లి: టేకులపల్లి మండలం గంగారం, మేళ్లమడుగు, చింతోనిచెలక గ్రామపంచాయతీల కార్యదర్శులు శ్రీహరి, దీప్తి, రాజు బదిలీ అయ్యారు. వీరిని గంగారం మాజీ సర్పంచ్ సమ్మయ్య ఆధ్వర్యంలో ఆదివారం గంగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్, పంచాయతీ వర్కర్లు, సెర్ప్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ముసురుతో పత్తి పంటకు ముప్పు

- సాగుకు పెట్టుబడి భారం
- ఎర్రబారుతున్న మొక్కలు
- ఆందోళనలో పత్తి రైతులు



పత్తి చేలో పాటు చేస్తున్న రైతు

సుజాతనగర్: ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి సాగుకు పెట్టుబడి భారం రెట్టింపు అవుతోంది. దీనికి తోడు మొక్కలు ఎర్రబారి ఎదుగుదల నిలిచిపోయింది. దీంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వానాకాలంలో మండలంలో 10,870 ఎకరాల్లో పత్తి పంట సాగయింది. ఈ ఏడాది మొదట్లోనే తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఇప్పుడు వాతావరణ మార్పులతో పత్తి పంటకు తీవ్ర నష్టం కలగనుంది. ఇప్పటికే రైతులు దుక్కుల నుంచి మొదలుకొని విత్తనాలు, కలుపు, ఎరువులు, పురుగుల మందులు రెండు నుంచి మూడు దఫాలుగా వేశారు. ఒక్కో ఎకరాకు కనీసం రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు పెట్టుబడి పెట్టారు. ఒకవైపు పెట్టుబడి పెరగడంతో మరోవైపు పంట దిగుబడి కన్పించకపోవడంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. పైగా పంట చేతికి వచ్చేవరకు పెట్టుబడి భారం మరింత రెట్టింపు కానుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కలుపు మొక్కలు పెరిగి ఇక్కట్లు...

ముసురు వర్షాలకు తోడు పత్తి చేలల్లో కలుపు తీవ్రంగా ఉంది. నెలరోజులుగా కురుస్తున్న ఏకధాటి వర్షాలతో పత్తిలో కలుపు మొక్కలు తీవ్రంగా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కలుపు మొక్కలను తొలగించేందుకు కూలీలను పెట్టుకుంటే ఒక ఎకరాకు రూ.5 నుంచి రూ.6 వేల దాకా ఖర్చు వస్తుంది. అదే కలుపు మందు పిచికారీ చేస్తే ఎకరాకు రూ.1000 నుంచి రూ. 2 వేల వరకు ఖర్చు వస్తుండటంతో రైతులు కలుపు మందును పిచికారీ చేస్తున్నారు.

ఎకరం సాగు చేశా...



ఒక ఎకరంలో పత్తి పంట సాగు చేసిన. ఇప్పటి వరకు రూ.12 వేలు పెట్టుబడి అయింది. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడం వల్ల మొక్కలు ఎదగలేదు. మొదటిసారి వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో రెండోసారి మళ్లీ విత్తనాలు వేయాల్సి వచ్చింది. దీనికి ఇటీవల వర్షాల వల్ల మొక్కలు ఎర్రబారడంతో పాటు ఎదుగుదల ఆగిపోయింది.

– బాదావత్ రాంకుమార్, సీతంపేట బంజర

రూ.2 లక్షల పెట్టుబడి...



3 ఎకరాల సొంతానికి తోడు మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని మొత్తం 15 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఇప్పటి వరకు రూ.2 లక్షల పైనే పెట్టుబడి అయింది. గత నెల రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చేలల్లో నీరు నిలిచి మొక్కలు ఎర్రబారుతున్నాయి. ఆశించిన దిగుబడి రాదేమోనని భయంగా ఉంది.

– బానోత్ సక్రాం, బేతంపూడి

నివారణ చర్యలు చేపట్టాలి



ముసురుతో భూమిలో తేమ శాతం అధికంగా ఉండడం వల్ల పత్తి మొక్కలు ఎర్ర బారి ఎదుగుదల నిలిచిపోతుంది. ప్రస్తుత వర్షాలతో పత్తిలో వడలు తెగులు వచ్చే అవకాశం ఉంది. నీటిలో కరిగే ఎరువులైన మల్టీ కె (13:0:45) లేదా 10 గ్రా. యూరియా లీటరు నీటికి కలిపి వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

– జి.నర్మద, ఏఓ

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్వంచ: 2009-10 పదో తరగతి విద్యార్థులు

పాల్వంచ: పట్టణంలోని స్వాతి స్కూల్‌లో 2009-10లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకనొకరు ఉద్యోగం, యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.



ఇల్లెందు:1984-85 బ్యాచ్...

ఇల్లెందు: పట్టణంలోని కళాసీబస్తీలోని బీయూసీఎస్ పాఠశాలలో 1984-85 ఏడో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఇల్లెందు సమీపంలోని కోటమైసమ్మ అమ్మవారి సన్నిధిలో కలుసుకున్నారు. ఆనాటి స్కూల్ ముందు ఫొటోలు దిగి, చిన్ననాటి సంఘటనలను గుర్తు చేసుకుంటూ రోజంతా సరదగా గడిపారు.

'పోస్టును అడ్డం పెట్టుకుని అక్రమాలకు తెర'

పాల్వంచ: ఇటీవల ఏసీబీకి చిక్కిన పాల్వంచ టౌన్ ఎస్ఐ బి.రాము తన ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని అనేక మందిని ఇబ్బందులకు గురిచేశాడని హైకోర్టు న్యాయవాది కె.లక్ష్మారెడ్డి ఆరోపించారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఎస్సై ఏసీబీకి చిక్కాక ఆయన బాధితులు పలువురు బయటకు వస్తున్నారని తెలిపారు. ఖమ్మం రూరల్ ఎస్ఐగా పనిచేసినప్పుడు అద్దెకు ఉన్న ఇంటి యజమానికి అప్పు ఇచ్చినందున తిరిగి ఇచ్చేయాలని ఇబ్బంది పెట్టి ఆమె కొడుకుపై తప్పుడు కేసులు బనాయించాడని చెప్పారు. త్వరలో ఇంకొందరి వివరాలను ఆధారాలతో వెల్లడిస్తానని తెలిపారు.

ఇసుక దందా..



శంభునిగూడెంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్

టేకులపల్లి: టేకులపల్లిలో ఇసుక దందా మూడుపువ్వులు... ఆరుకాయలుగా సాగుతోంది. పోలీసులు, రెవెన్యూ, ఫారెస్టు, మైనింగ్ ఇలా ఎన్ని శాఖలు ఉన్నా... అడ్డూఅదుపూ లేకుండా టేకులపల్లి మండలంలో ఇసుక దందా కొనసాగుతుండటం గమనార్హం. గతంలో కేవలం రాత్రుల్లు మాత్రమే ఇసుక అక్రమ రవాణా జరిగేది. ప్రస్తుతం రేయింబగవళ్లు తేడా లేకుండా నిర్భయంగా ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తున్నారు. శంభునిగూడెం, మేళ్లమడుగు, మద్రాస్ తండా, కోయగూడెం, మద్దిరాల తండా, గంగారం తదితర ప్రాంతాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే ఇసుకను తోడుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లకు నంబర్లు, డ్రైవర్లకు లైసెన్స్‌లు కూడా ఉండవు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని, ఉన్నతాధికారులు స్పందించి ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేసి అనుమతులు ఇస్తే ఆయా గ్రామ పంచాయతీలకు ఆదాయం లభిస్తుందని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఇసుక రవాణాను అక్రమ అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లాభాల్లో 40శాతం వాటా చెల్లించాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాల్లో కార్మికులకు 40శాతం వాటా చెల్లించాలని తెలంగాణ గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు ఆదివారం హైదరాబాద్‌లో సీఎండీ బలరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు దాటిన నేపథ్యాన త్వరగా స్పందించాలని విన్నవించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి. శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ, నాయకుడు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: నీట్ కౌన్సెలింగ్‌కు హాజరు కానున్న మైనార్టీ వర్గాల విద్యార్థులు తహసీల్ నుంచి మైనార్టీ స్టేటస్ సర్టిఫికెట్ తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. నీట్ కౌన్సెలింగ్ సమయాన సమర్పించాల్సిన ఈ సర్టిఫికెట్లను గతంలో పాఠశాలల్లో ఇచ్చేవారని, ఇప్పుడు తహసీల్‌లో జారీ చేస్తున్నారని తెలిపారు.

'సీతారామ'తో జిల్లాకు ఒరిగేదేమీ లేదు..



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచ: సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులతో భద్రాద్రి జిల్లా రైతులకు చుక్క నీరు కూడా అందే పరిస్థితి లేదని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం అన్నారు. పాల్వంచలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా ఆయకట్టుకు నీరందేలా ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ విషయంలో జిల్లా మంత్రులు కూడా దృష్టి సారించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగినందున ఈసారి అలా జరగకుండా చూడాలని కోరారు. నరాటి ప్రసాద్, అడుసుమల్లి సాయిబాబు, వి.పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, మన్యం వెంకన్న, వనపర్ల జకరయ్య, శనగరపు శ్రీనివాసరావు, కోటి నాగేశ్వరరావు, రాహుల్, రాజశేఖర్, వెంకన్న, సత్యనారాయణ పాల్గొన్నారు.

శేష జీవితం సమాజసేవకే..



వెంకటేశ్వర్లుతో ప్రకృతి ఆశ్రమం సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: ఉద్యోగ విరమణ అనంతరం శేషజీవితాన్ని సుఖమయంగా జీవించాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. సింగరేణి సంస్థలో 37 ఏళ్లుగా వివిధ అధికార హోదాలో పనిచేసి, ఇటీవల రెస్క్యూ జీఎంగా ఉద్యోగ విరమణ పొందిన శనగ వెంకటేశ్వర్లు (ఎస్‌వీ) ఉద్యోగ విరమణ, అభినందన సభ ఆదివారం స్థానిక ప్రకృతి ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... శేషజీవితం సామాజిక సేవలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ జీఎం ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సామాజిక సేవలో తన శేషజీవితాన్ని గడుపుతానని వివరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్, సెంట్రల్ వర్క్‌షాప్ జీఎం దామోదర్‌రావు, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్, ప్రకృతి ఆశ్రమ నిర్వాహకులు సామాజికవేత్త మొక్కల వెంకటయ్య, మోడ్రన్ ఇక్రా స్కూల్ కరస్పాండెంట్ ఎండీ బాసిత్, మల్లెల రామనాథం, ఆశ్రమ నిర్వాహకులు సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుక



తీజ్ బుట్టలతో బంజారా యువతులు

ఇల్లెందురూరల్: లంబాడా గిరిజన యువతులకు ప్రీతిపాత్రమైన తీజ్ పండుగను మండలంలోని పోచారంతండా గ్రామంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. బంజారా యువతులు తీజ్ బుట్టల్లో గోధుమ గింజలు నాటి తొమ్మిది రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి మొలకలకు నీళ్లు పోస్తూ సంప్రదాయ పద్ధతిలో ఆడిపాడారు. గ్రామ పెద్ద తలపాగలో మొలకలు పెట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం తీజ్ బుట్టలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించి ఘనంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వాంకుడోత్ శ్రీను, జర్పుల రాములు, మాళోత్ కోటియా, బానోత్ కిషన్, ఆజ్మీర సక్రాం, ఆజ్మీర శ్రీను, జర్పుల నరేష్, ఇస్లావత్ సతీష్, బానోత్ సుధాకర్, వన్య, కవిత, సంధ్య, దివ్య, శిరీష, అరుణ, పింకి, ఉష, అఖిల, అంకిత తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిల్వలతో జనం అవస్థలు



టేకులపల్లి శ్రీరామా మెడికల్ షాపు ఎదురుగా



డీసీసీబీ బ్యాంకు వద్ద బురద

టేకులపల్లి: టేకులపల్లి, బొమ్మనపల్లి సెంటర్లలో ప్రధాన రహదారి వెంబడి బురద గుంతలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. కొన్ని సంవత్సరాలుగా వర్షం పడితే రోడ్డు వెంబడి వరద నీరు నిలిచి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. స్వచ్ఛదనం – పచ్చదనం నిర్వహించారు. అయినా చర్యలు లేకపోగా కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బురద గుంతలను పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీమాపై అవగాహన లోపం..

- ప్రమాదాల్లో నష్టపోతున్నా ప్రయోజనం పొందని కార్మికులు
- ఇల్లెందు కార్మిక శాఖలో 16,130 మంది నమోదు
- సభ్యత్వం లేక నష్టపోతున్న బాధితులు



బీమా కార్డుకు దరఖాస్తు చేసుకుంటున్న కార్మికులు

ఇల్లెందు: తెలంగాణ భవన నిర్మాణ, ఇతర కార్మికుల నమోదు, కార్మికుల ఉపాధి క్రమబద్ధీకరణ, సర్వీసు షరతులు చట్టాల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నా వాటి పట్ల అవగాహన లేక నష్టపోతున్నారు. ఏ రంగమైనా కార్మికులకు పని భద్రతతో పాటు బీమా సదుపాయం ఎంతో ముఖ్యమైంది. అయితే ఈ రెండు అంశాల్లో అటు యాజమాన్యాలు, ఇటు ప్రభుత్వాలు ఎలాంటి అవగాహన కల్పించలేకపోతున్నాయి. దీంతో ఏటా నష్టపోతున్నవారు ఎంతోమంది ఉంటున్నారు. వీటిని అధిగమించి ఎవరైనా కార్మికరంగంలో నిలదొక్కుకుంటే వారికి వెల్ఫేర్ బోర్డు చెల్లింపులు జరగడం లేదు. ఇక కొత్తగా నమోదు చేసుకునే కార్మికులకు కార్డులు అందజేయటం లేదు. రెన్యూవల్ కోసం వెళ్లిన వారికి ఆన్‌లైన్‌లో అనేక ఆటంకాలు జరుగుతున్నాయి. తంబింగ్ విధానంలోనూ లోపాలు ఉన్నాయి. అన్నిరకాల షాపుల్లో పని చేస్తున్న కార్మికులకు షాప్ అండ్ కమర్షియల్‌లో కనీస వేతనాలు అమలు చేయటం లేదు. కార్మికులు పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించడం లేదు. ఎనిమిది గంటల పని విధానం అమలుకు నోచుకోవటం లేదు. గుర్తింపు కార్డులు ఈఎస్ఐ సదుపాయం లభించటం లేదు. పెట్రోల్ బంక్‌లు, సినిమా హాళ్లు, గ్యాస్ గోడౌన్‌లలో మహిళా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

సభ్యత్వంతో కార్మికులకు ప్రయోజనాలు...

కార్మికశాఖ కార్యాలయంలో సభ్యత్వం పొందితే బీమా వర్తిస్తుంది. 18 ఏళ్ల నిండి 60 ఏళ్ల లోపు కార్మికులు ఆయా రంగాల్లో ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయి. గుర్తింపు కలిగిన సంస్థలో పనిచేసే కార్డు, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ కలిగి ఉంటే చాలు... మీ సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకుని రూ.110 చెల్లిస్తే 5 ఏళ్ల వరకు బీమా ఉంటుంది. 2019 జనవరి నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఐదేళ్ల తర్వాత రూ.60 చెల్లించి రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత మీ సేవలో రిజిస్ట్రేషన్ చేసుకున్న పత్రాలు సహాయ కార్మిక శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు పత్రంతో జతచేసి అందజేస్తే పరిశీలన అనంతరం కార్మికశాఖ ద్వారా కార్డు లభిస్తుంది. ఇలా కార్మికులకు ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది.

ఇతర ప్రయోజనాలు పొందే మార్గం..

కార్మికులు తమ కుమార్తె వివాహం కోసం దరఖాస్తు చేసుకుంటే రూ.30 వేలు అందజేస్తుంది. అలాగే గర్భిణులు ప్రసూతి సహాయం కోసం రూ.30 వేలు పొందవచ్చు. కార్మికులు పాక్షికంగా ప్రమాదానికి గురైతే రూ.6,00,000 లక్షలు, శాశ్వత వైకల్యం పొందితే రూ.4 నుంచి రూ.5 లక్షలు అందజేస్తారు. వైద్య ఖర్చులకు నెలకు రూ.4,500, దహన సంస్కార ఖర్చులకు రూ.30 వేలు పొందే అవకాశం ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ కోసం నెలకు స్కాలర్‌షిప్ కింద రూ.3 వేలు పొందే అవకాశం ఉంది. ఇలాంటి ప్రయోజనాలు ఉన్నా పొందే అవగాహన లేక నష్టపోతున్నారు.



ఇల్లెందు సహాయ కార్మికశాఖ కార్యాలయం

ప్రయోజనం పొందిన కార్మికులు..

ఇల్లెందు సహాయ కార్మిక శాఖ పరిధిలో ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాలు ఉన్నాయి. కార్మిక శాఖ పరిధిలో 16,130 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా మరణించిన వారు 227 మంది, వివాహానికి సహాయం కోసం 454 మంది, ప్రసూతి సహాయం కోసం 934 మంది, ప్రమాద బీమా 12 మంది లబ్ధి పొందారు.

సభ్యత్వంతో లాభం జరిగింది..



కార్మికశాఖ ద్వారా సభ్యత్వం పొందటం వల్ల మా అమ్మ గుండ్లపల్లి సావిత్రి అనారోగ్యంతో చనిపోయినప్పుడు రూ.1.30 లక్షలు బీమా వచ్చింది. ఆ డబ్బులు ఖర్చులకు ఉపయోగపడ్డాయి. లేకుంటే చేతి నుంచి డబ్బు పెట్టాల్సి వచ్చేది. అనారోగ్యం బారిన పడినప్పుడు కూడా ఖర్చు పెరిగింది.

– గుండ్లపల్లి నర్సింహా, కరెంటాఫీస్, ఇల్లెందు

కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి



కార్మికశాఖలో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. బిల్డింగ్ వర్కర్స్ యాక్ట్ అమలులో ఉంది. రిజిస్ట్రేషన్, డెలివరీ స్కీం, ఈ-శ్రామ్ కార్డులు అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికుల కోసం ఉన్నాయి. కార్మికులు తప్పకుండా ఉపయోగించుకోవాలి. తద్వారా ప్రభుత్వ సాయం పొందే అవకాశం ఉంది.

– పీవీకే శాస్త్రీ, సహాయ కార్మికశాఖ అధికారి

పల్లెల్లో శ్రావణమాసం బోనాల సందడి



పాల్వంచ: అమ్మవారి ఆలయంలో భక్తులు

శ్రావణమాసం సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో బోనాల సందడి నెలకొంది. బొడ్రాయికి, శ్రీముత్యాలమ్మ, పోషమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు, యువతులు బోనాలతో ఊరేగింపుగా బయలుదేరి శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: బోనాలతో బయలుదేరిన మహిళలు



ఇల్లెందురూరల్: కొమరారంలో బోనాలతో వెళ్తున్న మహిళలు



టేకులపల్లి: బొమ్మనపల్లిలో..



టేకులపల్లి: గోలియా తండాలో..



ఇల్లెందురూరల్: బోనాలతో ముత్యాలమ్మ గుడికి వెళ్తున్న భక్తులు